సాక్షి రంగారెడ్డి

గురువారం । 21 । డిసెంబర్ । 2023



యథేచ్ఛగా కబ్జాల పర్వం

బాలాపూర్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. 8లో▸



ఆ నిర్మాణాలు తొలగించాలి

ఆలయ స్థలంలో అక్రమ ఇళ్లను తొలగించాల్సిందేనని దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ ఆదేశించారు. 8లో▸



కాల్వలో మృతశిశువు

తల్లి గర్భంలో నుంచి వచ్చి వెచ్చని పొత్తిళ్లలో ఉండాల్సిన ఓ నవజాత శిశువు మురుగు కాల్వలో కనిపించింది. 8లో▸

న్యూస్‌రీల్

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టండి

ఆర్డీఓకు ఎంపీటీసీల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

తలకొండపల్లి: తలకొండపల్లి మండల ఎంపీపీ నిర్మలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కందుకూర్ డివిజన్ ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు మండల ఎంపీటీసీలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ మెజార్టీ నిరూపించుకోవాలని సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడురమేష్, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హేమరాజు,గౌతిరెడ్డి సునీతాసుదర్శన్‌రెడ్డి,పెంటమ్మ, అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

కన్హాను సందర్శించిన 'ఆటా' ప్రతినిధులు



గురూజీ దాజీతో ఆటా ప్రతినిధులు

నందిగామ: నందిగామ మండలంలోని కన్హా శాంతివనాన్ని బుధవారం ఆటా ప్రతినిధుల బృందం సందర్శించింది. ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ డీ పటేల్(దాజీ)ని కలిశారు. ధ్యానం, యోగాతో కలిగే ఉపయోగాలను గురూజీని అడిగి తెలుసుకున్నారు. ఆటా ప్రతినిధులు జయంత్ చల్లా, వేణు సంకినేని, రామకృష్ణారెడ్డి ఆల, సతీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్వాల్ బన్‌గయా మేజిస్ట్రేట్!



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్)గా మారారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని (సీఆర్పీసీ) సెక్షన్ 107 అనుసరించి బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న నగర కమిషనరేట్‌లో కోర్టు నిర్వహించారు. ఆధిపత్య పోరు కోసం గ్యాంగ్ వార్స్‌కు పాల్పడుతున్న ముఠాలపై విచారణ జరిపారు. కాలాపత్తర్ ఠాణా పరిధిలో నివసించే మహ్మద్ షానవాజ్ ఘూజీ, మైలార్‌దేవ్‌పల్లికి చెందిన మహ్మద్ అర్బాజ్ ముఠాల మధ్య కొన్నాళ్లుగా వైరం నడుస్తోంది. ఆధిపత్య పోరులో దాడులు, ప్రతిదాడులు చోటు చేసుకున్నాయి. ఇరువర్గాలకు చెందిన ముగ్గురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ రెండు గ్యాంగ్స్‌ను తన కోర్టుకు పిలిచిన కొత్వాల్ శ్రీనివాసరెడ్డి మందలించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలు ఉపేక్షించమని స్పష్టం చేస్తూ కేసు విచారణను వాయిదా వేశారు. బంజారాహిల్స్ ఠాణా పరిధికి సంబంధించి ఈ పోలీసు స్టేషన్ రౌడీషీటర్ సయ్యద్ మజీద్, ఆసిఫ్‌గర్ ఠాణా రౌడీషీటర్ సయ్యద్ ఎజాజ్ ముఠాల మధ్యా ఇదే పరిస్థితి ఉంది. వీరి ఘర్షణల కారణంగా వివిధ ఠాణాల్లో కేసులు నమోదు అయ్యాయి.వీరినీ మందలించిన కొత్వాల్ కేసు వాయిదా వేశారు. నగరంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తే ఉపేక్షించేది లేదనిస్పష్టం చేశారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూసేందుకు తనకు ఉన్న ఈ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలను భవిష్యత్తులోనూ వినియోగిస్తానని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. బుధవారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ జువాలజీ-ఇన్నోవేషన్స్ ఛాలెంజస్ అండ్ అపార్చునిటీస్' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ప్రిన్సిపాల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా సీఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్.వినయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమానికి 350 మంది ప్రతినిధులు హాజరుకాగా హెడ్ ప్రొ.మాధవి, డీన్ ప్రొ.కరుణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వణుకుతున్న వసతి గృహాలు

బీసీ హాస్టళ్లలో విద్యార్థుల అవస్థలు

- గీజర్లు లేకపోడంతో చన్నీటితోనే స్నానం
- పగిలిన కిటికీలు, డోర్లు
- మాంచాల్లేక నేలపైనే నిద్ర
- చలి తీవ్రతకు రోగాలబారిన పడుతున్న వైనం





ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, (ఇన్‌సెట్‌లో) చన్నీటితో స్నానం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకవైపు ఎముకలు కొరికే చలి.. మరోవైపు ముట్టుకుంటే ఒళ్లు జలదరించే చన్నీటిస్నానం... వెరసి జిల్లా వెనుకబడిన తరగతుల(బీసీ) వసతి గృహాల్లోని విద్యార్థులు గజగజ వణికిపోతున్నారు. ఉదయం నిద్రలేచిన తర్వాత మలమూత్ర విసర్జనకు వెళ్లిన విద్యార్థులు చన్నీటితో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కూడా వెనుకాడుతున్నారు. చలి తీవ్రతకు రోజుల తరబడి స్నానానికి దూరంగా ఉంటూ చర్మవ్యాధుల బారినపడుతున్నారు. పడుకునేందుకు మంచాలు కూడా లేకపోవడంతో నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి. దీనికితోడు ప్రభుత్వ చెల్లింపులకు బహిరంగ మార్కెట్లోని వస్తు ధరలకు ఏమాత్రం పొంతన లేకపోవడంతో నాసిరకం నిత్యవసరాలు కొనుగోలు చేసి విద్యార్థులకు వడ్డించాల్సి వస్తోంది.

కంటికి కునుకు కరువే..

రంగారెడ్డి జిల్లాలో 18 పాఠశాల(బీసీ) వసతి గృహాలు ఉండగా, వీటిలో 14 బాలురు, నాలుగు బాలికల వసతి గృహాలు ఉన్నాయి. మొత్తం 888 మంది బాలబాలికలు ఇక్కడ వసతి పొందుతున్నారు. అదే విధంగా 21 కాలేజీ వసతి గృహాలు ఉండగా, వీటిలో 3,021 మంది వసతి పొందుతున్నారు. ఇక మేడ్చల్ జిల్లాలో 20 కళాశాల వసతి గృహాలు ఉండగా.. వీటిలో 12 బాలురు, 8 బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 3,042 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. పాఠశాల వసతి గృహాల్లోని విద్యార్థులకు ఏటా ఒక బెడ్‌షీట్, కార్పెట్, నాలుగు జతల బట్టలు, ప్లేటు, గ్లాసు, స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే మంచాలు సరఫరా చేస్తుంది. వేడినీళ్ల కోసం గ్రీజర్లు కూడా ఏర్పాటు చేసింది. కానీ బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు మంచాలు సరఫరా చేయడం లేదు. దీంతో ఆ విద్యార్థులంతా నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గదుల తలుపులు విరిగిపోయి ఉండటం, కిటికీల అద్దాలు పగిలిపోవడం, కప్పుకునేందుకు సరైన దుప్పట్లు కూడా లేకపోవడంతో చలికి గజగజ వణికిపోతున్నారు. చలికారణంగా రాత్రిపూట కంటి నిండా నిద్రలేకపోవడంతో మధ్యాహ్నం సమయంలో తరగతి గదుల్లో కునుకు తీస్తున్నారు.

డైట్ చార్జీలు అంతంతే..

పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు (3 నుంచి 7వ తరగతి వరకు) నెలకు రూ.950 చొప్పున, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1100 చొప్పున ప్రభుత్వం డైట్ చార్జీలు చెల్లిస్తోంది. అదే విధంగా కళాశాల విద్యార్థులకు నెలకు రూ.1500 చొప్పున చెల్లిస్తోంది. అలాగే పాఠశాల విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీల కింద బాలురకు నెలకు రూ.50, హెయిర్ కటింగ్ చార్జి కింద నెలకు రూ.12 చొప్పున చెల్లిస్తున్నట్లు చెపుతోంది. ఇక బాలికలకు కాస్మొటిక్ చార్జీల కింద రూ.55 నుంచి రూ.75 వరకు చెల్లిస్తుంది. నిజానికి బహిరంగ మార్కెట్లోని వస్తు ధరలకు (సబ్బులు, హెయిర్ ఆయిల్, పౌడర్ తదితర) ఇవి ఏమాత్రం సరిపోవడం లేదు. అంతేకాదు హెయిర్ కటింగ్ చార్జీ బహిరంగ మార్కెట్లో రూ.60పైనే వసూలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం రూ.12 మాత్రమే చెల్లిస్తోంది. ఆయా చెల్లింపులు దేనికీ సరిపోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విమర్శలున్నాయి. మిగితా వసతి గృహాల్లాగే బీసీ హాస్టళ్లలో కూడా గీజర్లు ఏర్పాటు చేయడంతో పాటు మంచాలు ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

చలికి భయపడి స్నానానికి దూరం

బీసీ వసతి గృహాల్లో వేడినీళ్ల కోసం గీజర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉదయం స్నానానికి చన్నీళ్లే దిక్కవుతున్నాయి. చలికి భయపడి కొంతమంది విద్యార్థులు రోజుల తరబడి స్నానానికి దూరంగా ఉంటూ గజ్జి, తామర వంటి చర్మవ్యాధుల బారినపడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో చన్నీటితో స్నానం చేసినవారు జలుబు, తలనొప్పి, జ్వరం వంటి జబ్బుల బారినపడుతున్నారు. ఇక మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. రోజులతరబడి వీటిని శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. వంటగదుల్లోనూ పరిశుభ్రత ఉండటం లేదు. బాత్‌రూమ్‌లకు సరిగా డోర్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే స్నానం చేస్తున్నా రు. హాస్టల్ పరిసరాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించకపోవడం, రాలిన చెట్ల ఆకులను ఊడ్చకపోవడంతో పాములు, తేళ్లు సంచరిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

నివేదిక పంపించాం

ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో విద్యార్థులు చన్నీటితో స్నానం చేసేందుకు ఇబ్బందిపడుతున్న మాట వాస్తవమే. అయితే ట్యాంక్‌లో నిల్వఉన్న నీటికి బదులు.. వెచ్చదనం కోసం ఉదయం మోటార్ ఆన్‌చేసి అప్పుడే తోడిన నీటిని కుళాయిలకు వదులుతున్నాం. మంచాలు, గీజర్ల ఏర్పాటు విషయపై ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించాం. అయితే ఇప్పటివరకు ఎలాంటి అనుమతి రాలేదు. విధిలేని పరిస్థితుల్లో పిల్లలు నేలపై పడుకోవాల్సి వస్తోంది. 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు దుప్పట్లు, కార్పెట్ ఇస్తున్నప్పటికీ.. కాలేజీ విద్యార్థులు మాత్రం సొంతంగా వాటిని సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

– విమలాదేవి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి

ఎలక్షన్.. కలెక్షన్

- జీహెచ్‌ఎంసీ టెన్షన్
- మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికలు
- త్వరలోనే లోక్‌సభ ఎలక్షన్లు
- బల్దియా ఖజానాపై ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో: వరుస ఎన్నికలు జీహెచ్ఎంసీ ఖజానాపై ప్రభావం చూపనున్నాయి. ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లు ఎన్నికల వల్ల జీహెచ్‌ఎంసీ కలెక్షన్లు తగ్గుతున్నాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ కలెక్టర్లది కాగా, హైదరాబాద్ జిల్లాలో మాత్రం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ది. దీంతో ఎన్నికల నిర్వహణకు జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాల సిబ్బంది పనిచేయాల్సి వస్తోంది. దీని వల్ల ఆస్తిపన్ను వసూలు చేసే బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సైతం ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సి రావడంతో పూర్తిస్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లు చేయలేకపోతున్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల వల్ల ఆస్తిపన్ను వసూళ్లు మందగించి నవంబర్ నెల జీతాలు ఇంకా చెల్లిస్తున్నారు. ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ), చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ తదితరులు జోన్లవారీగా జోన్ల కార్యాలయాలకు వెళ్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలతో..

మరోవైపు, దాదాపు నాలుగు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండటాన్ని తలచుకొని అధికారులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే కొత్త ఓటరు జాబితా ఎస్ఎస్ఆర్–2024కు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. ఫిబ్రవరి 8వ తేదీన ఓటరు తుదిజాబితాను వెల్లడించాల్సి ఉంది. ఈలోగా జరగాల్సిన పనులన్నింటికీ మల్టీట్యాక్స్ సిబ్బందిని వినియోగించుకుంటారు. దీంతో వసూళ్లు కుంటుపడే ప్రమాదం ఉంది. నోటిఫికేషన్ వెలువడితే ఆస్తిపన్ను వసూళ్లు కష్టమే. సిబ్బందిని ఎన్నికల పనులకు వినియోగిస్తారు. ఈ సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్ రూ.2000 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.1200 కోట్లు వసూలయ్యాయి. నోటిఫికేషన్ వెలువడితే ఈసారి మార్చినెలలోనూ ఇబ్బందులే ఉంటాయని సంబంధిత అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్షన్ల వల్ల కలెక్షన్లకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో తమకు టెన్షన్ పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు.



వెబినార్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

ఫిబ్రవరి 8న తుది ముసాయిదా

- కలెక్టర్ భారతి హోళికేరి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్.. జిల్లా కలెక్టర్లు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ భారతి హోళికేరి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో, సాఫీగా నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా నిర్వహణపరమైన ఏర్పాట్లపై దృష్టిని కేంద్రీకరిస్తామని.. ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన అంశాలతో కూడిన వివరాలను సిద్ధం చేస్తామన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 22 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని.. ఫిబ్రవరి 2లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా రూపొందించేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని కలెక్టర్ అన్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించడం, పేర్లు తొలగించిన వాటి విషయంలో ఇంటింటి సర్వే చేపడగామని, డూప్లికేషన్లు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌ఓలు పాల్గొన్నారు.

15 ఏళ్ల కల నెరవేరింది

- వ్యక్తిగతంగా, సామాజికపరంగా ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాను
- నన్ను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటాను
- అసెంబ్లీ సమావేశాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భావోద్వేగం



షాద్‌నగర్: 'అధ్యక్షా...' రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ జీవితంలో ఒక్కసారైనా అసెంబ్లీలో ఈ మాట అనాలని ఉంటుంది. అయితే కొందరికే అది సాధ్యం అవుతుంది. సుమారు 15 ఏళ్ల సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత ఈ అవకాశం తనకు దక్కిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భావోద్వేగ ప్రసంగం చేశారు. ఈ క్రమంలో తొలి అసెంబ్లీ అనుభవాలు ఆయన మాటల్లోనే..

మరుపురానిది..

కొన్ని కొన్ని సంఘటనలు జీవితంలో మరుపురానివిగా మిగిలిపోతుంటాయి. నాతొలి అసెంబ్లీ అనుభవం కూడా అలాంటిదే. నా అదృష్టం ఏమిటంటే నాతో పాటు నాపార్టీ కూడా రాష్ట్రంలో అధికారంలో వచ్చింది. తొలి అడుగులోనే అధికార పార్టీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కూర్చోవడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అనుభవజ్ఞులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులతో అసెంబ్లీలో గడిపిన తొలి క్షణాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికైనప్పుడు తొలిసారిగా అసెంబ్లీలో మాట్లాడే అవకాశం దక్కింది. ఆయన గురించి రెండు మాటలు చెప్పే అవకాశం రావడం సంతోషాన్నిచ్చింది.

ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం..

ఇదివరకు ఓవైపు అధికార పక్షం మాటల తూటాలు, ప్రతిపక్షం సవాళ్లను టీవీల్లో చూడటమే తప్ప ప్రత్యక్షంగా చూసే అవకాశం లేకుండా పోయింది. ఇన్నాళ్లకు ఆ అవకాశం దక్కింది. ఇప్పుడిప్పుడే అసెంబ్లీ నిబంధనలకు అలవాటు పడుతున్నాను. అసెంబ్లీకి ఒక అరుదైన గౌరవం ఉంది. ఆ గౌరవాన్ని కాపాడేలా భవిష్యత్‌లో నా వ్యవహారశైలి ఉంటుంది. అదేవిధంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల ప్రస్తావనకు వేదికగా అసెంబ్లీని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటాను.

సీఎం మాటలతో బాధ్యత పెరిగింది..

రజక సామాజిక వర్గంలోని ఓ సామన్య కుటుంబం నుంచి వచ్చి విజయం సాధించిన మా వీర్లపల్లి శంకర్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో నా పేరును ప్రస్తావించడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది. పార్టీలోని మిగితా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి చాలా నేర్చుకుంటున్నాను. రాజకీయాల్లో వ్యక్తిగతంగా, నా సామాజిక వర్గానికి సంబంధించి ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నాను. కొన్ని సందర్భాల్లో చాలా బాధపడ్డాను కూడా. అన్నీ తట్టుకుని నిలబడ్డాను. ప్రజలు కూడా తగిన గౌరవాన్ని ఇచ్చి అసెంబ్లీకి పంపించారు. అసెంబ్లీలో ఆ గౌరవాన్ని కాపాడుకుంటాను. మొత్తానికి నా తొలి అసెంబ్లీ అనుభవం చాలా తృప్తినిచ్చింది. నాకు అవకాశం ఇచ్చిన షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది. షాద్‌నగర్ నియోజకవర్గ సమస్యలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు అసెంబ్లీని ఒక వేదికగా మార్చుకుంటాను. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తాను.

ఉత్తమ డిపోగా మహేశ్వరం



అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి

- ఇంధన పొదుపు, అధిక లాభాల నేపథ్యంలో అవార్డు

మహేశ్వరం: ఇంధన పొదుపులో మహేశ్వరం ఆర్టీసీ డిపోను రాష్ట్రస్థాయి ఉత్తమ డిపోగా గుర్తించడంతో పాటు గోల్డ్ మెడల్ లభించింది. నగరంలోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు బుధవారం నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో.. మహేశ్వరం ఆర్టీసీ డిపో తెలంగాణ స్టేట్ ఎనర్జీ కన్‌జర్వేషన్ అవార్డుతో పాటు గోల్డ్‌మెడల్ అవార్డును సొంతం చేసుకుంది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ రిటైర్డ్ అధికారి చందన్‌మిత్ర చేతుల మీదుగా మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి అవార్డులను అందుకున్నారు. నష్టాలను అధిగమించడంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో క్రమశిక్షణతో పనులు చేయించడంతో పాటు డీజిల్, ఆయిల్ వాడకాన్ని పొదుపు చేస్తూ ట్రిప్పులు అధికంగా నడిపి డిపోకు అధిక లాభాలు తీసుకొచ్చినందుకు గాను మహేశ్వరం డిపోకు ఈ అవార్డులు వచ్చాయని డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని.. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ అవార్డులు తీసుకొస్తామని ఆయన తెలిపారు.

వేడుకలకు ముస్తాబు

- నేటి నుంచి ప్రత్రీజీ ధ్యాన మహాయాగ ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు
- దేశ, విదేశాలనుంచి తరలిరానున్న ధ్యానులు



మహేశ్వర మహాపిరమిడ్

కడ్తాల్: ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రమైన కైలాసపురి మహాపిరమిడ్ యాగ వేడుకలకు ముస్తాబయ్యింది. ఈనెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. దివంగత ప్రత్రీజీ ధ్యాన మహాయాగం– 2 కోసం హైదరాబాద్ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో అల్మాస్‌గూడ సమీపంలోని ధ్యాన వేదిక సిద్ధమవుతోంది. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మిక, ధ్యాన గురువులు హాజరవుతారని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ప్రత్రీజీ సతీమణి స్వర్ణమాల వేడుకలను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దేశ, విదేశాల నుంచి..

పదకొండేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశం నలుమూల నుంచి తరలివచ్చే ధ్యానులు.. ధ్యాన మహాచక్రాలు, ధ్యాన మహాయాగంలో పాల్గొంటారు. ఎప్పటిలాగే ఈ ఏడాది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి వచ్చే వేలాది మంది ధ్యానుల మధ్య ప్రత్రీజీ ధ్యాన మహాయాగాలు కొనసాగుతాయి. ధ్యానులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక వసతి, ఉచిత భోజన సదుపాయం కల్పించడంతో పాటు వసతి గృహాలు, కుటీరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజు ధ్యానం చేసేందుకు వీలుగా భారీ సభా ప్రాంగణం, ప్రత్యేకంగా అలంకరించిన వేదికను సిద్ధం చేశారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు.

నిర్వహించే కార్యక్రమాలు..

ధ్యాన మహాయాగంలో భాగంగా నిత్యం ప్రత్రీజీ వీడియో సందేశం, ప్రముఖ ధ్యాన గురువులు, ఆధ్యాత్మికవేత్తల, పిరమిడ్ మాస్టర్ల సందేశాలను వినిపిస్తారు. ఉదయం 5 నుంచి 8:30 గంటల వరకు వీడియో సందేశాలు, సామూహిక వేణుగాన ధ్యానం, అఖండ ధ్యానం, ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ధ్యాన గురువుల సందేశాలు, గురు సమ్మేళనాలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సంగీత ధ్యానం నిర్వహిస్తారు. ధ్యాన వేడుకలకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక ధ్యాన గురువులు రానున్నట్లు మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.ధ్యానులు తరలిరావాలని కోరారు.

యథేచ్ఛగా కబ్జాల పర్వం

- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు


మామిడిపల్లిలోని ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలు

మహేశ్వరం: బాలాపూర్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మండల పరిధిలోని జల్‌పల్లి గ్రామంలోని 223 సర్వే నంబర్‌లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములలో నిర్మాణాలు కొనసా గుతుండగా.. తాజాగా మామిడిపల్లిలో కూడా కబ్జాల పర్వం ఆరంభమైంది. సర్వే నంబర్ 99/1లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల పేరుతో జీవో నంబర్ 59ను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటూ ఏకంగా ఓ కాలనీనే నిర్మించుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో గజం రూ.40–50 వేలు పలుకుతున్న తరుణంలో ప్రభుత్వ భూములపై తమకెందుకు హక్కు ఉండదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మిగిలిన ప్రభుత్వ భూమిలో ఎవరికి తోచిన విధంగా వారు కంచెలు ఏర్పాటు చేసుకోవడం, హద్దురాళ్లు పాతుకోవడం ప్రారంభించారు. రెండు రోజులుగా ఈ విషయమే గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. రెవెన్యూ అధికారులు ఇకనైనా మేల్కొని కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు.

కార్మికుడి దుర్మరణం

భవనంపై నుంచి కింద పడిన సంఘటన

మీర్‌పేట: భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన ఎర్ర బుగ్గయ్య(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం ఆయన వినాయకహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి స్లాబ్‌కు సెంట్రింగ్ డబ్బా కొడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి 3వ అంతస్తు నుంచి కిందపడ్డారు. తీవ్ర గాయాలవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బుగ్గయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. మీర్‌పేట పోలీసులు శాంతింపజేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు భవన యజమాని వెంకటేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బద్యానాయక్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు

- ఇళ్లను కూల్చి వేయాలని కోర్టు తీర్పు
- దేవాదాయ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్


అక్రమ నిర్మాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

కొందుర్గు: దేవాలయ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించాల్సిందేనని దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ బుధవారం ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. కొందుర్గులోని శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై ట్రిబ్యునల్ కోర్టులో కేసులు వేశారన్నారు. మొత్తం 72 కేసులు నమోదు కాగా, 12 కేసులకు సంబంధించి దేవాలయానికి అనుకూలంగా తీర్పు వెలువడిందన్నారు. కొందుర్గు, లూర్దునగర్ గ్రామాల్లో కలిసి ఇన్నారెడ్డి, ప్రశాంత్, అంజమ్మ, సాదక్, లింగమయ్య, ఇబ్రహీం, రామచంద్రయ్య, అంజమ్మ, బాల్‌రాజ్, రాజు ఇళ్లను స్వాధీనం చేసుకోవడానికి ఇదివరకే నోటీసులు జారీ చేశామన్నారు. దేవాలయ ఆస్తులను కాపాడటంలో తగిన చర్యలు తీసుకుంటామని, ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని అన్నారు. ఈ సందర్భంగా అధికారుల బృందం ఆయా గ్రామాలను సందర్శించి ఇళ్లను పరిశీలించి, ఖాళీ చేయాలని ఆదేశించారు. తమకు మరో పదిహేను రోజులు గడువు ఇవ్వాలని స్థానికులు కోరడంతో అధికారులు అంగీకరించారు. అనంతరం అధికారులు కొందుర్గు, పెండ్యాల శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, అధికారులు ప్రవీణ్, చంద్రమోహన్, ఆంజనేయులు, ఈఓ శ్రీనివాస శర్మ, దేవాలయ కమిటీ చైర్మన్ గోపాల్, ఉప సర్పంచ్ రాజా రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రకటన

శ్రీ సుదేశ్‌రెడ్డి, బ్రాంచి మేనేజర్ గారిచే ప్రాతినిధ్యము వహించబడుచున్న నా క్లయింటు M/s ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, షాద్‌నగర్ గారి సూచనల మేరకు సమస్త ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా, ప్రస్తుత రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలము, ఫరూఖ్‌నగర్ గ్రామ పరిధిలోని, షాద్‌నగర్ పురపాలక పరిధిలోని ఆషోకాలనీలోని సర్వే నెం.200లోని ప్లాటు నెం.32 విస్తీర్ణము 140 చదరపు గజముల పై నిర్మించిన గృహము నెం.1-237/1ను హామీగా చూయిస్తూ ఋణమును మంజూరీ చేయవలసినదిగా కోరుతూ గృహ యజమాని శ్రీ దండిపేట రాఘవేంద్రచారి తండ్రి సుభాష్‌చారి నివాసము ఇం.నెం.1-237/1, అషోకాలనీ, షాద్‌నగర్ గారు నా క్లయింటును సంప్రదిస్తూ, సదరు గృహము ప్లాటుకు సంబంధించిన షాద్‌నగర్ సబ్ రిజిష్ట్రారు గారి వద్ద రిజిష్ట్రీ కాబడిన లింకు దస్తావేజు నెం.లు 1205/2002, 2736/2000, 1617/1985, 7698/2005, 706/2004 మరియు 358/2004 అసలు దస్తావేజులు పోగొట్టుక పోయినట్లు తెలియజేసినారు. కావున సదరు దస్తావేజులు కలిగి ఉండటం వలన ఎవరికైనా ఎలాంటి హక్కులు సంక్రమించినా లేదా నా క్లయింటు మంజూరు చేయబోవు ఋణము విషయంలో ఏవైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (6) ఆరు రోజుల లోపల ఈ దిగువ సంతకము దారుకు తగు ఆధారముల యుక్తముగా వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. ఎలాంటి హక్కులు లేకున్ననూ సదరు దస్తావేజులు కలిగి ఉన్నచో ఈ దిగువ సంతకముదారుకు అందజేయగలరు.

సం/- కనకగిరి మోహన్‌రావు, న్యాయవాది
ఇం.నెం.13-303, కాలేజ్ రోడ్డు, క్రిష్టియన్ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా - 509216. సెల్ : 9949013315

మంత్రి తుమ్మలకు సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న చిలక నర్సింహారెడ్డి తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును తెలంగాణ నాన్ గెజిటెడ్ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రమ్, జాయింట్ సెక్రెటరీ ఎల్.శ్రీనివాస్‌లు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మార్కెటింగ్ శాఖ అభివృద్ధికి ఉద్యోగులు ప్రత్యేక కృషి చేస్తారన్నారు. మార్కెటింగ్ కమిటీలో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది, ఇతర కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తాము ముందుంటామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం


మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని పంట పొలాల్లో గుర్తు తెలియని వృద్ధుడు(66) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయన భిక్షాటన చేస్తూ కొన్ని రోజులుగా గ్రామ సమీపంలో తిరుగుతున్నాడు. మృతుడు ఆకలి బాధతో చనిపోయాడా, చలికి తట్టుకోలేక మృతిచెందాడా అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేశారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపారు.

బస్సులో వస్తారు.. బైక్‌తో వెళ్తారు

- ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్
- 17 వాహనాలు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శబరీష్


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కుత్బుల్లాపూర్: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలతో పాటు వాటిని కొనుగోలు చేసి ఇతరులకు అమ్మిన మరో వ్యక్తిపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి సుమారు రూ.8.50 లక్షల విలువచేసే 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ డీసీపీ శబరీష్, ఏసీపీ రఘునందన్ రావు, సీఐ ప్రశాంత్ సమక్షంలో నిందితుల వివరాలను వెల్లడించారు. వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగతనం అవుతున్న నేపథ్యంలో పేట్ బషీరాబాద్ సీఐ ప్రశాంత్, డీఐ రాజు ప్రత్యేకంగా టీం తయారుచేసి దొంగతనం చేస్తున్న వారికోసం వేట ప్రారంభించారు. పలు సీసీ కెమెరాలు గుర్తించిన పోలీసులు ఆ దిశగా అడుగులు వేశారు.

తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు..

మెదక్ జిల్లా లింగారెడ్డిపేట్ కు చెందిన సెంట్రింగ్ పనులు చేసే మన్నె మహేష్ (23) అదే గ్రామానికి చెందిన కారు డ్రైవర్ షేక్ అమీర్ (29) జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలు చేస్తూ వాటిని అమ్ముకుంటూ వస్తున్నారు. మెదక్ జిల్లా నుండి నగరానికి బస్సులో రావడం.. ఇక్కడ ద్విచక్ర వాహనం దొంగతనం చేసి బైక్‌పై వెళ్లడం చేస్తున్నారు. ఈ క్రమంలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకంగా 11 కేసులు నమోదు కాగా, జీడిమెట్ల, అల్వాల్, మేడ్చల్, జిన్నారం, శంకరంపేట్ పోలీస్ స్టేషన్లో పరిధిలో ఒక్కో కేసు నమోదు అయింది. అయితే వీరు మొత్తం 17 వాహనాలు దొంగిలించి ఎత్తుకుపోగా 16 కేసులు నమోదు అయ్యాయి. మరొకరు ఫిర్యాదు చేయాల్సి ఉంది. పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ ద్విచక్ర వాహనాల దొంగలు ఎట్టకేలకు కొంపల్లి –దూలపల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో అనుమానంతో వారిని అదుపులో తీసుకొని తమదైన శైలిలో ప్రశ్నించగా పై దొంగతనాల వివరాలను వెల్లడించారు. వీరిద్దరితో పాటు వాహనాలను కొనుగోలు చేసిన మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన డ్రైవర్ రాజును కూడా రిమాండ్‌కు తరలించారు.

మురుగు కాల్వలో మృతశిశువు

- ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించిన పోలీసులు
- కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు


మృతదేహం


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

షాద్‌నగర్ రూరల్: తల్లి గర్భంలో నుంచి వచ్చి వెచ్చని పొత్తిళ్లలో ఉండాల్సిన ఓ నవజాత శిశువు మురుగు కాల్వలో కనిపించింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన వారే మురుగు నీటిలో పడేశారు. దీంతో పేగు బంధాన్ని తెంచుకున్న ఆ శిశువు ఆయువు అనంత లోకాలకు చేరింది. ఈ హృదయ విదారక సంఘటన బుధవారం షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని ఓపెన్ డ్రైనేజీలో గుర్తు తెలియని మగ శిశువు మృతదేహం పారుతున్న మురుగు నీటిలో కొట్టుకుపోతూ కనిపించింది. ఇది గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు.

మృత శిశువును పడవేసి ఉంటారా?

కాల్వలో దొరికిన శిశువు బొడ్డు కూడా ఊడలేదు. కొద్ది గంటల క్రితమే జన్మించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. శిశువు గర్భంలోనే మృతి చెందాడా..? పుట్టిన కొద్ది సేపట్లోనే మరణించాడా..? అనే అనుమానాలు వ్యక్తవుతున్నాయి. ఒకవేళ చనిపోయి ఉంటే చిన్నారి దేహాన్ని పాతి పెట్టాల్సిన వారు మురుగు కాల్వలో పడవేశారా..? అనేది తెలియరాలేదు. ఎస్‌ఐ శరత్‌కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు తెలియకపోవడంతో శిశువు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్ తెలిపారు.

'పరిణత వాణి' పదో సంపుటి ఆవిష్కరణ


సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎల్లూరి శివారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురించిన ×పరిణతవాణి₹ ప్రసంగాల పదవ సంపుటి బుధవారం ఆవిష్కృతమైంది. పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షులుగా ఉండగా 1993లో ప్రారంభమైన పరిణతవాణి ప్రసంగ పరంపరలో తెలుగునాట అత్యంత ప్రసిద్ధులైన కవి పండితులు ఎందరో పాల్గొన్నారని చెప్పారు. ఇప్పటి వరకు దాదాపు 107 మంది ప్రముఖులు పరిణీత వాణి ప్రసంగాలు చేశారని, 10 సంపుటాలుగా ప్రసంగ వ్యాసాలను వెలువరించడం జరిగిందన్నారు. ఈ సంపుటిలో ప్రముఖ కవులు రచయితలు డాక్టర్ జి.అమృతలత, డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్ ఓలేటి పార్వతీశం, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, వీఆర్.విద్యార్థి, నాళేశ్వరం శంకరం, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, విహారిల పరిణతవాణి ప్రసంగాలు ఉన్నాయి. కార్యక్రమంలో పరిష్యత్ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, సభ్యులు డాక్టర్ సి.వ సుంధర రెడ్డి, ఆచార్య ఎస్వీ రామారావు పాల్గొన్నారు.

దుబాయ్ కరెన్సీ పేరుతో దోచేస్తారు!

- తక్కువ కమీషన్‌కు ఎక్స్ఛేంజ్ అంటూ ఎర
- తొలుత అసలు నోటు ఇచ్చి నమ్మించే వైనం
- ఆపై 'తెల్లకాగితాలు' అప్పగించి నిండా మోసం
- అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్


పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ కరెన్సీ ఇస్తే తక్కువ కమీషన్‌కు దుబాయ్ దిరమ్స్ ఇస్తామంటూ ఎర వేసి మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాకు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఢిల్లీ, బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన ఏడుగురిని పట్టుకుని, వారి నుంచి వాహనంతో పాటు నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ శ్రీబాల బుధవారం వెల్లడించారు. ఢిల్లీకి చెందిన మహ్మద్ ఇమ్రాన్ షేక్, వహీద్ షేక్ ఈ ముఠాకు నేతృత్వం వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఢిల్లీలో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న హసీమ్ ఆలం, మహ్మద్ అలీ షేక్, ఇతడి భార్య కుల్సుం, షేక్ నిస్సార్ అహ్మద్, దిశలతో వీరు పరిచయాలు పెంచుకున్నారు. అక్కడ ఎన్నాళ్లు ఉద్యోగం చేసినా నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే వస్తాయని, తమతో కలిసి తాము చెప్పినట్లు చేస్తే ఒక్కో 'పని'కి రూ.20 వేల వరకు ఇస్తామని చెప్పారు. దీనికి ఈ ఐదుగురూ అంగీకరించడంతో వారితో కలిసి ముఠా కట్టారు. మనీ ఎక్స్ఛేంజ్ ఫ్రాడ్ ఎలా చేయాలనే అంశంపై వీరికి శిక్షణ ఇచ్చారు. ఆపై నగరానికి చేరుకున్న ఈ గ్యాంగ్ ఘట్‌కేసర్, పటాన్‌చెరు, సికింద్రాబాద్‌ల్లోని లాడ్జిల్లో షెల్టర్లు ఏర్పాటు చేసుకుంది. వీళ్ళు దిమర్స్ పేరుతో మోసాలు చేస్తుంటారు. దుబాయ్‌లో ఉండే వాళ్లలో తెలుగు వారే ఎక్కువ కావడంతో ఇక్కడి వారినే టార్గెట్‌గా చేసుకున్నారు. తొలుత తమ ముఠా సభ్యుల్ని వివిధ ప్రాంతాల్లో తిప్పే ఇమ్రాన్, వహీద్ పలువురితో పరిచయం పెంచుకుని మాట్లాడుతూ దీరమ్స్ మీద ఆసక్తి కలిగి ఉన్న వారిని గుర్తించేలా చేస్తారు. ఆపై వీళ్లిద్దరూ రంగంలోకి దిగుతారు. తమ వాళ్లు సుదీర్ఘకాలంగా దుబాయ్‌ల పని చేస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తమ వద్ద భారీగా దిరమ్స్ ఉన్నాయని, తాము నేరుగా భారత కరెన్సీతో మార్చుకోవడానికి పన్ను సంబంధిత ఇబ్బందులు వస్తాయని నమ్మబలుకుతారు. తమ వద్ద తక్కువ కమీషన్‌కు వీటిని తీసుకుని, ఆపై ఎక్కడైనా ఎక్స్ఛేంజ్ చేసుకుంటే భారీ లాభం ఉంటుందని చెప్తారు. వీరి మాటలు నమ్మడానికి ముందు బాధితులు మచ్చుకు కొన్ని నోట్లు కావాలని అడుగుతారు. ఇందుకు అంగీకరించిన ఇమ్రాన్, వహీద్ ఒకటి రెండు అసలు దీరమ్స్ వీరికి ఇస్తారు. ఇవి మార్కెట్‌లో తేలిగ్గా ఎక్స్ఛేంజ్ కావడంతో బాధితులకు పూర్తి నమ్మకం ఏర్పడుతుంది. ఆపై భారీ మొత్తం తీసుకోవడానికి సిద్ధమవుతారు. అప్పుడు అసలు కథ ప్రారంభించే ఈ ద్వయం తమ ముఠాతో కలిసి తెల్లకాగితాలను దీరమ్స్ సైజులో కత్తిరిస్తారు. ప్రతి బండిల్‌కు పైన–కింద అసలు నోట్లు, మధ్యలో ఈ తెల్లకాగితాలు పెట్టి కట్టలు కట్టిస్తారు. వీటిని న్యూస్‌పేపర్లలో ప్యాక్ చేసి తీసుకువస్తారు. బాధితుడి నిర్మానుష్య ప్రాంతంలో కలిసి నగదు తీసుకుని ఈ డమ్మీ కరెన్సీ కట్టలను అందిస్తారు. హడావుడి చేయడం ద్వారా అక్కడ నుంచి పంపేసి, ఇంటికి వెళ్లిన తర్వాత సరి చూసుకోవాలని చెప్తారు. అలా వెళ్లి, చూసుకున్న బాధితులు తాను మోసపోయానని గుర్తించినా చేసేది లేక మిన్నకుండిపోతున్నారు. ఈ ముఠా రాష్ట్ర వ్యాప్తంగా మోసాలు చేసినా కేవలం బోయిన్‌పల్లి, తిరుమగిరిల్లోనే కేసులు నమోదయ్యాయి. వీరి వ్యవహారాలపై సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.భాస్కర్ రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు బి.అశోక్‌రెడ్డి, పి.గగన్‌దీప్, జి.నవీన్ రంగంలోకి దిగారు. సికింద్రాబాద్‌లో వలపన్ని ఏడుగురినీ పట్టుకుని ఓ ద్విచక్ర వాహనం, రూ.7.47 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులకు బోయిన్‌పల్లి ఠాణాకు అప్పగించిన అధికారులు వీరి విచారణలో అష్వక్ వెలుగులోకి రావడంతో అతడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

అమెరికన్ డాలర్లు ఇస్తామని చెప్పి...

పంజగుట్ట: ఇండియన్ కరెన్సీకి రెట్టింపు అమెరికన్ డాలర్లు ఇస్తామని నమ్మించి నగదు కాజేసిన ఘటనలో ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. పంజగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జియాగూడలో నివాసముండే ఆర్.జయప్రకాష్ సీ బీఎస్ దగ్గర చెప్పుల దుకాణం నడుపుకునే ఆర్.జయప్రకాష్‌కు పాతబస్తీకి చెందిన నదీం అలియాస్ ఓమర్ (45), రాంలాల్‌లు (47) పరిచయమయ్యారు. తమవద్ద అమెరికా డాలర్లు ఉన్నాయని, తన కూతురు వివాహం ఉందని తనకు అర్జెంటు నగదు కావాలని నదీం నమ్మబలికాడు. రెండు లక్షల ఇండియన్ కరెన్సీ ఇస్తే నాలుగు లక్షల రూపాయలు విలువచేసే డాలర్లు ఇస్తామని జయప్రకాష్‌కు నమ్మబలికారు. నదీం తాను నిమ్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తుంటానని, నిమ్స్ ఆసుపత్రిలో నగదు మార్చుకుందామని చెప్పడంతో బుధవారం మధ్యాహ్నం నిమ్స్ ఆసుపత్రికి వచ్చారు. జయప్రకాష్ వద్ద ఉన్న రూ.1.88 లక్షల నగదు తీసుకుని వారివద్ద ఉన్న అమెరికా డాలర్లు ఇచ్చారు. జయప్రకాష్ ఇచ్చిన డబ్బులు తీసుకుని రాంలాల్‌కు ఇచ్చిన నదీం..అక్కడనుండి పారిపోవాలని సూచించడంతో రాంలాల్ పారిపోయాడు. జయప్రకాష్ డాలర్లు చూసుకోగా ముందు ఒక నోటు, ఆఖరున ఒక డాలర్ నోటు ఉంది. మధ్యలో తెల్లపేపర్లు ఉండడంతో ఖంగుతిన్నాడు. వెంటనే నదీంను పట్టుకుని ప్రశ్నించడంతో ఇద్దరూ వాగ్వాదానికి దిగారు. అక్కడున్న నిమ్స్ సిబ్బంది గమనించి ఇద్దర్నీ పట్టుకుని పంజగుట్ట పెట్రోకార్‌కు ఫోన్‌చేశారు. అక్కడకు వచ్చిన పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి జయప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాంలాల్ కోసం గాలిస్తున్నారు.